క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని అశోక్ నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పత్తేబాద 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, వార్షిక మరమ్మతుల నిమిత్తం బుధవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. పత్తేబాద, రైతు బజారు, గంగా చికెన్ సెంటర్ ప్రాంతం, పత్తేబాద నాలుగు గుడుల సెంటర్ మిలటరీ క్యాంటీన్ రోడ్డు, మోతేవారి తోట, సమస్కారం పార్క్ ప్రాంతాల్లో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

ఉపాధి కూలీలను ఆదుకోవాలి

ఏలూరు (టూటౌన్): కుక్కునూరు మండలం దామచర్ల గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేసి సుమారు 20 మంది ఆసుపత్రి పాలయ్యారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాయపడిన కూలీలకు ప్రభుత్వమే ఉచిత వైద్యం అందించాలని, నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కూలీలకు అదనంగా పని కల్పించాలని, పని ప్రదేశాల్లో మెడికల్ కిట్స్ లేక పోవడంతో ప్రాథమిక చికిత్స అందక కూలీలు నానా ఇబ్బంబుదులు పడ్డారని గుర్తు చేశారు.

బ్యాలెట్ బాక్సులు భద్రం


బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తున్న ఆర్వో, జేసీ లావణ్యవేణి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో 86 శాతం ఓటింగ్ నమోదైందని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ బీ లావణ్యవేణి అన్నారు. దెందులూరు ఆర్వో కార్యాలయంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో పోలింగ్ సంతృప్తికరంగా జరిగిందని, పోలింగ్ శాతం పెరిగిందన్నారు. సమష్టి ప్రణాళిక, ఉద్యోగస్తుల సమన్వయం దీనికి కారణమన్నారు. నియోజకవర్గంలో బ్యాలెట్ బాక్సులను సీఆర్ఆర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి ఎన్నికల కమిషన్‌కు నిబంధనలకు అనుగుణంగా పోలీస్ భద్రత, సీసీ కెమెరా ఏర్పాటు చేశామన్నారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి స్వామి ఆలయం వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన తవ్వా శ్రీనివాస గుప్తా ఆర్థిక సాయం అందించారు. అర్చకుల సమక్షంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలు


లైబ్రరీలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

భీమడోలు: గ్రంథాలయాలు జ్ఞాన సముపార్జన నిలయాలని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగుతులు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళ వారం వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని తమకు నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని వాటిని చదివి సామూహిక పుస్తక పఠనం చేసారు. వేసవి సెలవులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహిళల ఓటింగే అధికం

- ఏలూరులో 70.16 శాతం పోలింగ్ నమోదు
- ఓటు హక్కు వినియోగించుకున్న 1,65,132 మంది
- అభ్యర్థుల విజయాలపై జోరుగా పందాలు
- జూన్ 4న ఫలితాలు


సోమవారం జరిగిన ఎన్నికల్లో బారులు తీరిన ఓటర్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 2024 సార్వత్రిక ఎన్నికల హడావుడి సద్దుమణిగింది. ఏలూరు నియోజకవర్గంలో 70.16 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 1,65,132 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈవీఎంలను, వీవీపాట్‌లను అధికారులు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. ఫలితాల కోసం మరో మూడు వారాల వరకు అంటే జూన్ 4వ తేదీ వరకు వేచి ఉండాల్సి ఉంది. నగరంలోని వివిధ పోలింగ్ బూత్‌లలో సమయానికే పోలింగ్ ముగియగా దాదాపు 70 బూత్‌లలో సాయంత్రం 6.30 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటలు దాటే వరకూ కూడా పోలింగ్ కొనసాగింది. పోలైన ఓట్లలో అత్యధిక శాతం మహిళదే. ఏలూరు నియోజకవర్గంలో మొత్తం 2,35,345 మంది ఓటర్లలో 1,12,426 మంది పురుషులు, 1,22,872 మంది మహిళలు, మరో 47 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. వీరిలో 85,510 మంది మహిళలు, 79,607 మంది పురుషులు, మరో 15 మంది ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అభ్యర్థుల విజయంలో మహిళల ఓటింగే కీలకం కానుంది.

జూన్ 4న ఫలితాల వెల్లడి

దేశ వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలు నిర్వహిస్తోన్న నేపథ్యంలో అన్నిరాష్ట్రాల్లో ఎన్నికలు ముగిశాకే ఫలితాలు వెల్లడించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. దీంతో జూన్ 4వ తేదీన దేశ వ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌తో పాటు పార్లమెంట్ స్థానాలకు జరిగిన ఎన్నికల కౌటింగ్‌నూ అదేరోజు చేపడతారు. కౌంటింగ్ ప్రారంభించిన రెండు గంటల్లోనే ఫలితాలపై ఒక అంచనా వచ్చే అవకాశం ఉంది. అభ్యర్థులు, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు జూన్ 4వ తేదీ కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

గెలుపు ఓటములపై జోరుగా చర్చ

ఎప్పుడాఎప్పుడా అని ఎదురు చూసిన ఎన్నికలు ముగిశాయి. ప్రస్తుతం నగరంలో గెలుపు ఓటములపై జోరుగా చర్చ నడుస్తోంది. ముఖ్యమంత్రి జగన్ అమలు చేసిన అమ్మఒడి, ఆసరా, చేయూత, విద్యాదీవెన, వసతి దీవెన, రైతు భరోసా, నేతన్న నేస్తం, వాహనమిత్ర వంటి పథకాలు వైఎస్సార్ సీపీ అభ్యర్థులను మరోసారి గెలిపించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈసారి ఎన్నికల్లో మహిళామణులు అధిక సంఖ్యలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. తమకు వివిధ పథకాల కింద నేరుగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేయడంతో మహిళలు జగన్ వెంటే నడిచారనే చర్చ నడుస్తోంది. కూటమి ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ఏడాదికి సుమారు రూ.1.65 లక్షల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఏర్పడడంతో అదే జరిగితే తమకు ప్రతి నెలా జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా ఉండదనే భయంతో ప్రభుత్వ ఉద్యోగులు సైతం వైఎస్సార్ సీపీ వైపే ఎక్కువగా మొగ్గ చూపారని చెబుతున్నారు.

అభ్యర్థుల విజయాలపై పందాలు

ఈ ఎన్నికల్లో అభ్యర్థుల విజయాలపై పందాలు కూడా గట్టిగానే జరుగుతున్నాయి. కరోనా సమయంలో ప్రజల వెన్నంటి ఉండి వారి ప్రాణాలకు కాపాడి కొన్ని వేల కుటుంబాలను ఆదుకున్న మాజీ ఉపముఖ్యమంత్రి, ఏలూరు ఎమ్మెల్యే నానికి విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావించి ఆయనే గెలుస్తారని పందాలు ఎక్కువగా కడుతున్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, పార్టీల కతీతంగా లబ్ధిదారులకు వేల సంఖ్యలో సొంతిళ్లు పంపిణీ చేయడంలో నాని చూపిన చొరవ సైతం ఆయన విజయానికి రాచ బాటలు వేశాయంటున్నారు. జనసేన నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని భావించిన రెడ్డి అప్పలనాయుడు జనసేనాని టీడీపీతో జట్టు కట్టడంతో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోయారు. ఆయన టీడీపీ అభ్యర్థికి మనస్ఫూర్తిగా పని చేయలేదని, సోమవారం జరిగిన ఎన్నికల సందర్భంగా టీడీపీ అభ్యర్థి బడేటి చంటితో బూత్‌లలో పర్యటించిన సమయంలో సైతం ఆయన ఓటర్లకు గ్లాసు గుర్తును చూపి ఓటు వేయాలని సైగలు చేయడం కూడా చంటి విజయావకాసాలను దెబ్బతీశాయంటన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం మారుతుందని టీడీపీ అభిమానులు, తిరిగి తమదే ప్రభుత్వం అని వైఎస్సార్ సీపీ అభిమానులు రూ.లక్షల్లో పందాలు కడుతున్నారు. కొందరు మరో అడుగు ముందుకేసి కోసు పందాలు కూడా కడుతున్నారు.

పోలింగ్ సామగ్రి తరలింపు

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గంలోని సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ సోమవారం రాత్రి వరకు కొనసాగింది. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి సారథ్యంతో ఎన్నికల అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించడంతో గతం కన్నా ఎక్కువగా పోలింగ్ శాతం అధికంగా నమోదైంది. గత 2019 ఎన్నికల్లో 86.07 శాతం కాగా ప్రస్తుతం 87.75 శాతం నమోదైంది. దీనితో 1.68 శాతం పెరిగింది. దీనితో ఎన్నికల అధికారుల సమర్థతకు నిదర్శంగా విశ్లేషిస్తున్నారు. ఎన్నికల సిబ్బంది తమ ఎన్నికల పోలింగ్ మెటీరియల్‌ను బస్సుల్లో, వ్యాన్‌ల్లో అర్ధరాత్రి ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలకు తరలించారు. ఈవీఎమ్, కంట్రోల్ యూనిట్, వీవీప్యాడ్ మిషన్లను భద్రంగా తమ వెంటే పెట్టుకుని అధికారులు ఏలూరుకు తీసుకుని వెళ్లారు. దీనితో తెల్లవారే వరకు వారంతా పడిగాపులు కాసారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద గల అధికారులను అందించారు. ఎన్నికల సిబ్బంది తమ ఇళ్లకు మంగళవారం చేరుకున్నారు.

సైలెంట్ ఓటింగ్.. కూటమి నేతల్లో గుబులు

గత ఎన్నికల కన్నా ఈ ఏడాది పోలింగ్ శాతం పెరగడంతో ప్రభుత్వానికి మద్దతుగా ఓట్లు వేసినట్లు సర్వేలు చెబుతున్నాయి. అత్యధికంగా మహిళలు, రైతులు, మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారంతా ప్రభుత్వానికి పెద్ద ఎత్తున మద్దతు ప్రకటించి ఓట్లు వేసారన్న ప్రచారం జరుగుతోంది. వారంతా క్యూ లైన్లలో నిలబడి సైలెంట్‌గా వచ్చి ఓట్లు వేసారు. దీనితో కూటమి నేతులు తలలు పట్టుకున్నారు. కూటమి మేనిఫెస్టో మహిళలు, రైతులు, నిరుద్యోగులను మెప్పించలేదకపోయింది.

ఉత్సాహంగా ఓటెత్తిన కొల్లేరు ప్రజలు

ఏలూరురూరల్: దెందులూరు నియోజకవర్గంలోని కొల్లేరు గ్రామాల ప్రజలు మరోసారి వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టనున్నారని స్పష్టమవుతోంది. ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల కారణంగా లంక గ్రామాల ప్రజలు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కొఠారు అబ్బయ్యచౌదరికే పెద్ద ఎత్తున ఓట్లు వేసారని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. దీనికి కారణం చేసిన అభివృద్ధి అని స్థానికులు అంటున్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అబ్బయ్యచౌదరికి 13,117 ఓట్లు పోలవ్వగా, టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్‌కు 11,537 ఓట్లు వచ్చాయి. మొత్తంగా వైఎస్సార్‌సీపీకి 1,580 ఓట్లు మెజారిటీని కొల్లేరు ప్రజలు కట్టబెట్టారు. ఇప్పుడు ఆ మెజారిటీ 5వేలకు పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. చింతమనేని కారణంగా ప్రత్తికోళ్లలంకలో వివాదం నెలకొన్న 460ఎకరాల చేపల చెరువుల సమస్యను అబ్బయ్యచౌదరి పరిష్కరించి ప్రజలను ఆదుకున్నారు. ఫలితంగా గ్రామస్తులు అబ్బయ్యచౌదరికి భారీ మెజారిటీ ఇస్తున్నారని అంచనా వేస్తున్నారు. 2014లో జరిగిన ఎన్నికల్లో చింతమనేనికి వచ్చిన 4,728ఓట్లు మెజారి టీని అబ్బయ్యచౌదరి ఈ సారి అధిగమిస్తారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. ఏలూరు రూరల్ గ్రామాల్లో 32,484 మంది ఓటర్లు ఉండగా 80 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు లెక్కగట్టారు.

అభివృద్ధికే పట్టం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఏలూరు రూరల్ మండలానికి చెందిన 15 గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం కొఠారు అబ్బయ్యచౌదరి రూ.300 కోట్ల నిధులు ప్రభుత్వం నుంచి విడుదల చేయించారు. ఇందులో రూ.20 కోట్లతో కై కులూరు రోడ్డు, రూ.8 కోట్లతో గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు రోడ్డు అభివృద్ధి జరిగింది. ప్రతి గ్రామంలో సుమారు రూ.కోటి ఖర్చు చేసి సచివాలయాలు, ఆరోగ్యశ్రీ, ఆర్‌బీకే కేంద్రాలు ప్రభుత్వం నిర్మించింది. దీనికి తోడు రూ.100 కోట్ల రూర్బన్ ప్రాజెక్టుతో 11 ఓవర్‌హెడ్ ట్యాంకులు, సుమారు 20 కిలోమీటర్ల మేరకు తాగునీటి పైపులైన్ వేసింది. గుడివాకలంకలో రూ.4.50 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించారు. పైడిచింతపాడు, ప్రత్తికోళ్లలంక, పెదయాగనమిల్లి, కోమటిలంక, కొక్కిరాయిలంక గ్రామాల ప్రజల తాగు నీరు, ఆర్థిక అవసరాలు తీర్చేందుకు చేపల చెరువులను తవ్వించారు.

ప్రజల ఆదాయం పెంచిన ఎన్నికలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): సార్వత్రిక ఎన్నికలు నగరంలో ప్రజల ఆదాయాన్ని పెంచాయి. ఎన్నికల పేరు చెప్పుకుని అనేక వర్గాలకు ఆదాయం ఊహించిన దానికంటే ఎక్కువగా వచ్చింది. ఈ ఎన్నికలు వివిధ పార్టీలకు చావో, రేవో అన్నచందంగా పరిణమించడంతో ఆయా పార్టీల అభ్యర్థులు ఖర్చుకు వెనకాడకుండా డబ్బులు తీయడంతో ఆయా వర్గాల ఆదాయం తారాస్థాయికి చేరింది. ఎన్నికల్లో అభ్యర్థులు వినియోగించే జెండాలు, బ్యాడ్జీలు, ఫెక్సీలు, టోపీలు, కండువాలు ఇలా ఆయా వస్తువుల తయారీతో కొందరు, ప్రచారానికి అభ్యర్థుల ఘనతను చాటుతూ గీతాలు రాయడంతో పాటు వాటిని పాటలుగా మలిచి రికార్డింగ్ చేసి మరికొందరు ఉపాధి పొందారు. ప్రచారానికి వినియోగించిన ఆటోలు, ఇతర వాహనాల వారు సైతం తాము సాధారణ రోజుల్లో పొందే ఆదాయానికి రెండితల ఆదాయం పొందారు. వివిధ డివిజన్లలో అభ్యర్థుల శిబిరాల్లో ఉండే యువతకు నిత్యం భోజనాలు, అల్పాహారాలు అందించే కాంట్రాక్టులు పొంది కొందరు ఆదాయం గడించారు. వివిధ పార్టీల అభ్యర్థులకు ఓటర్లకు డబ్బులు పంచడంతో స్థానికులకూ చేతిలో డబ్బులు ఆడాయి. ఐదుగురు ఓటర్లు ఉన్న కొన్ని కుటుంబాలకు ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు ఓటుకు రూ.1000 చొప్పున పంపిణీ చేయడంతో ఆ కుటుంబానికి రూ.15 వేలు అందాయి. ఇలా ఓటర్ల వద్ద కూడా డబ్బు చేరడంతో నగరంలోని పలు వ్యాపారాలు ఊపందుకున్నాయి. ఎన్నికలు ప్రారంభమైన నాటి నుంచి బిర్యానీ పాయింట్లు, ఫ్యాన్సీ దుకాణాలు, వస్త్ర దుకాణాలు కళకళలాడగా, ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసిన నాటి నుంచి ఆయా దుకాణాలకు ప్రజలు తండోపతండాలుగా తరలివెళ్లారు. అలాగే సినిమా థియేటర్లు కూడా హౌస్‌ఫుల్ అవుతూ కలెక్షన్ల వర్షం కురిపించాయి.

వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడి దుర్మార్గం


నడిపల్లిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ, దళిత నేత గొట్టేటి స్టాలిన్, ఇతర నాయకులు

పెదవేగి : వైఎస్సార్‌సీపీ కార్యకర్త చలపాటి రవి బాబుపై టీడీపీ గుండాలు అతి కిరాతకంగా దాడి చేయడాన్ని వైఎస్సార్‌సీపీ పెదవేగి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎస్సీ సెల్ నాయకుడు గొట్టేటి స్టాలిన్ తీవ్రంగా ఖండించారు. పెదవేగి మండలం నడిపల్లిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై జరిగిన దాడి ఘటనపై దళిత నాయకులు సమావేశం ఏర్పాటు చేసి ఖండించారు. కొప్పులవారి గూడెంలో పోలింగ్ సమ యంలో వైఎస్సార్‌సీపీ సర్పంచ్ కుమారుడైన చలపాటి రవిపై దారుణంగా దాడిచేసి కత్తెరతో గాయపర్చిన వారిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ గెలవలేమన్న ఉక్రోషంతో టీడీపీ శ్రేణులు ఇలాంటి దాడులకు పాల్పడటం దుర్మార్గమని అన్నారు. లక్ష్మీపురంలో దళిత కుటుంబానికి చెందిన వ్యక్తిపై సాక్షాత్తు చింతమనేని దాడి చేయడం హేయ మైన చర్య అన్నారు. వైఎస్సార్‌సీపీ నడిపల్లి గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉక్కుర్తి నాగేశ్వరావు కొప్పుల వారి గూడెంలో జరిగిన దాడిని ఖండించారు. మద్దాల గోపాలరావు వెంట్రపాటి మహేష్, చల్లారి పోతు రాజు, సుబ్బారావు, మద్దాల లక్ష్మీనారాయణ, మట్టా నారాయణ రావు, గొడ్డాటి తాతారావు, విజయరాజు పాల్గొన్నారు.

అంతర పంటలు.. ఆదాయం భళా

- తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం
- స్వల్ప కాలంలోనే పంట చేతికి
- అన్నదాతలకు ఆర్థిక భరోసా


గార్లమడుగులో అరటిలో అంతర పంటగా నిమ్మ


కొబ్బరిలో అంతర పంటగా సాగుచేస్తున్న జామ

పెదవేగి : వాణిజ్య పంటల్లో అంతర పంటలుగా వివిధ రకాల కూరగాయలు, పూలసాగు చేపట్టి అధిక లాభాలను పెదవేగి మండల రైతులు ఆర్జిస్తున్నారు. ఈ పంటలకు దీర్ఘకాలంగా పెట్టుబడులు పెట్టాల్సి ఉండటంతో రైతులు అదనపు ఆదాయ వనరుగా అంతర పంటలను సాగు చేస్తున్నారు. వాణిజ్య పంటలు సాగు చేసే రైతులు మార్కెట్‌లో ఫలసాయం అందే సమయంలో ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్నారు. పంటలు బాగా పండినా గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఈ అంతర పంటలు ఆర్థికంగా అన్నదాతలను ఆదుకుంటున్నాయి. ఈ పంటల సాగుతో ప్రధాన పంటకు పెట్టుబడి కోసం అప్పుల కోసం వెళ్లాల్సిన పని లేకుండా అంతర పంటలు ఆదాయాన్నిస్తున్నాయి.

నియోజకవర్గంలో 3,750 ఎకరాల్లో అంతర పంటలు

దెందులూరు నియోజకవర్గంలో అంతర పంటల సాగు సుమారుగా 3,750 ఎకరాల్లో జరుగుతోంది. వీటిలో అధికంగా పెదవేగి, కొండలరావుపాలెం, బాపిరాజుగూడెం, విజయరాయి, జగన్నాథపురం, రామశింగవరం, కూచింపూడి, వేగివాడ, టి గోకవరం, చల్లచింతలపూడి, మేదినరావుపాలెఎం, రామారావుగూడెం పంగిగూడెం, కొక్కిరిపాడు, వేంపాడు, గ్రామాల్లో సుమారు 3,250 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

అంతర పంటలుగా ఎన్నో రకాలు

వాణిజ్య పంటలైన అరటి, కంద, కొబ్బరి, పసుపు, జామ, వంటి పంటల్లో బెండ, మిరప, ఆకుకూరలు, వంగ వంటి పంటలతో పాటు పూల సాగును అంతర పంటలుగా వేస్తున్నారు. వాణిజ్య పంటలు వేసిన నాటి నుంచి ఫలసాయం అందడానికి 9 నెలల నుంచి 11 నెలల సమయం పట్టడంతో రైతులు అప్పటివరకు ఏదో విధంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. ఈ ఏడాది అరటి, కంద పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొబ్బరికి గిట్టుబాటు ధర ఉన్నా దిగుబడి లేకపోవడం వల్ల ఆదాయం అంతంత మాత్రంగానే వచ్చింది. దీనితో ఈ తోటల్లో పసుపు, అరటి, కోకో, కంది, కూరగాయలు పంట వేస్తున్నారు.

ఎన్నో లాభాలు

వాణిజ్య పంటలకు ఏడాది పొడవునా పెట్టుబడి పెట్టాల్సి ఉండగా ఈ పంటల ద్వారా లభించే ఆదాయాన్ని వినియోగించడంతో ఆర్థిక భారం తగ్గుతుందని చెబుతున్నారు. అంతే కాకుండా చేలల్లో కలుపు అంతంత మాత్రంగానే రావడం, ఈ అంతర పంటలకు పెట్టుబడి తక్కువ అవడం, ఎక్కువ లాభాలు రావడంతో వీటిని సాగుచేయడానికి రైతు మొగ్గు చూపుతున్నారు. ఎరువులు, పురుగుమందుల ధరలు చుక్కలనంటడంతో ఒక పంటను సాగుచేసి లాభాలు ఆర్జించే రోజులు కనుమరుగయ్యాయని రైతులు చెబుతున్నారు. వేసిన పంట బాగా ఉన్నా అధిక దిగుబడులు వచ్చినా ఆ సమయంలో మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించకపోతే నష్టపోవాల్సి వస్తోందని తెలిపారు. అందుకే ఈ అంతర పంటలు వేయడం వల్ల కేవలం 45 రోజుల్లో ఫలసాయం పొంది లాభాలు ఆర్జించవచ్చని చెబుతున్నారు. వాణిజ్య పంటలకు పెట్టుబడి పెరగడంతో ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఈ పంట ఉత్పత్తులు ఆదుకుంటున్నాయని రైతులు చెబుతున్నారు. కూరగాయల పంటలు సాగుచేయడం వల్ల నిత్య ఆదాయం లభిస్తోందని చెబుతున్నారు.

తెగుళ్లనూ తరిమేయొచ్చు

అంతర పంటలతో భూములకు, రైతులకు ఎంతో మేలని వ్యవసాయాధికారి ప్రియాంక తెలిపారు. ఈ పంటల వల్ల పంటల్లో వచ్చే తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుందన్నారు. ఇందుకు కారణం పూలసాగుతో అక్కడకు వచ్చే మేలు చేసే మిత్ర పురుగులు క్రిమికీటకాలను ఆహారంగా తీసుకుంటాయని చెప్పారు. దీనివల్ల తెగుళ్ల ఆశించవని వెల్లడించారు. చేలల్లో కలుపు నివారణ అవుతుంది, పెట్టుబడి తక్కువగా ఉంటుందని, నీటి సమస్య ఉండదని, నిత్య ఆదాయం పొందవచ్చని వివవరించారు. పంట మార్పిడి వల్ల భూమికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఈ పంటల నుంచి వచ్చే పచ్చిరొట్టతో భూసారం పెరుగుతుందన్నారు.

ఎటువంటి ఇబ్బందీ లేదు



కొబ్బరి, కోకోలో ఆనపకాయ, రెండెకరాల బీర తోట పందిరి ఏర్పాటు చేసి అంతర పంటగా బంతి తోట సాగు చేస్తున్నారు. చేను కౌలుకు తీసుకున్నాను. అంతర పంటల వల్ల పెట్టుబడి తక్కువ అవడంతో పాటు అదనపు ఆదాయం వస్తోంది. అంతర పంటలు ఆదుకుంటున్నాయి.

– పంజగల నరశింహరావు, కౌలు రైతు

లాభాలు ఆర్జించవచ్చు



వాణిజ్య పంటలో ఏదో ఒకటి అంతర పంట సాగు చేస్తాను. కొబ్బరిలో కోకో, ఆయిల్ పామ్‌లో కోకో పంటలను సాగు చేస్తున్నాను. ఏదో పంటను అంతర పంటగా వేయడం వల్ల అదనంగా ఆదాయం ఆర్జించవచ్చు. దీనితో పెట్టుబడికి కూడా ఇబ్బంది ఉండటం లేదు.

– పులగం వేణుగోపాలరెడ్డి, రైతు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.00	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.30	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	01
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	29

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	01
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	02
ఏలూరు -బీహెచ్ఈఎల్	20.15	4802	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -బీహెచ్ఈఎల్	22.10	98503	32
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.20	98511	35
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ఏలూరు -తిరుపతి	16.00	4830	32

బారులు తీరిన మహిళలు

ఉంగుటూరు: అందరి చూపు మహిళలు నిశ్శబ్దంగా వేసిన ఓటు మీదనే ఉంది. అధిక శాతం పోలింగ్ ఎవరివైపునో అనే చర్చ గ్రామాల్లో సాగుతోంది. రాజకీయంగా తిరిగే వారివద్దనుంచి సామాన్య ఓటరు సైతం ఓటింగుసరళిని అంచనాలు వేసుకుంటూ చర్చలు సాగిస్తున్నారు. ప్రధానంగా మహిళలు ఎక్కువ మంది పోలింగు కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళల ఓటు ఎవరికి పడిందనే విషయంపై చర్చ సాగుతోంది. ఉంగుటూరు నియోజకవర్గంలో 87.75 శాతం ఓటింగు నమోదైంది.

చల్లబడ్డ వాతావరణం

బుట్టాయగూడెం: ఉక్కపోతలతో అల్లాడిపోతున్న ప్రజలకు మంగళవారం సాయంత్రం కురిసిన వర్షంతో ఉపశమనం లభించింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో ప్రజలు బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితుల్లో సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. దీనికితోడు మరో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెప్పడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

1,92,901 మంది ఓటు హక్కు వినియోగం


పెదపాడు మండలంలోని సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈవీఎంలను భద్రపర్చే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టరు, ఎన్నికల పరిశీలకులు

పెదపాడు: దెందులూరు నియోజకవర్గంలో 1,92,901 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బీ లావణ్యవేణి తెలిపారు. సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పోలింగ్ సిబ్బంది స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ కృష్ణకాంత్ పాఠక్, ఎస్ ఏరామన్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు ప్రసన్న వెంకటేష్, ఎస్పీ డి.మేరీ ప్రసాంతి, సమక్షంలో భద్రపర్చే కార్యక్రమాన్ని జేసీ పర్యవేక్షించారు. ఈ సందరర్భంగా లావణ్యవేణి మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గంలో 86.11 శాతం ఓట్లు పోలయ్యాయని చెప్పారు. ఈవీఎంలను వివిధ రాజకీయ ప్రతినిధులు, ఎన్నికల పరిశీలకుల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచినట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించినందుకు పోలింగ్ సిబ్బందిని జేసీని అభినందించారు.